www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 17 జనవరి 2024



తిరుపతి అసెంబ్లీ టికెట్ టీడీపీ..? జనసేన..?

- నిధుల సేకరణలో ఇరు పార్టీలు
- తిరుపతి ఎమ్మెల్యే సీటుకు కొత్త ముఖాలు

భూమన అభినయ్ రెడ్డి
వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

సుగుణమ్మ
తిరుపతి మాజీ ఎమ్మెల్యే

పసుపలేటి హరిప్రసాద్
జనసేన తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి

ఆర్కాట్ కృష్ణ ప్రసాద్
బిఆర్‌ఎస్ నాయకులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో జరగనున్నాయి. తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తనయుడు, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన వినయ్ రెడ్డి పేరు ను ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. టీడీపీ, జనసేన పార్టీలు పొత్తుతో ముందుకు సాగుతున్నాయి. తిరుపతి అసెంబ్లీ సీటు టీడీపీ తీసుకుంటుందా? లేక జనసేన తీసుకుంటుందా? అనే చర్చ నగరంలో జోరుగా సాగుతోంది. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థికి ధీటుగా టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థిని నిలబెట్టాలని భావిస్తున్నారు. తిరుపతి అసెంబ్లీ టికెట్టు తమకే కేటాయిస్తారని జనసేన అంటుండగా పవన్ కళ్యాణ్ తిరుపతి అసెంబ్లీకి పోటీ చేస్తే టీడీపీ తిరుపతి అసెంబ్లీ సీటును వదులుకుంటుందని ఆ పార్టీ వర్గాలు అంటున్నారు. తిరుపతిలో వైసీపీ అభ్యర్థిని ఓడించాలంటే ఇక్కడ బలిజ సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉన్నాయి. తిరుపతి అసెంబ్లీకి పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే వైసీపీ అభ్యర్థి ఓటమి తథ్యమని వారు అంటున్నారు. పవన్ కళ్యాణ్ పోటీ చేయకపోతే తిరుపతి అసెంబ్లీ టీడీపీకి కేటాయించాలని టీడీపీ నాయకులు అంటున్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో వైసిపి ప్రభుత్వం అరాచకాలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు, అక్రమ కేసులు, గంజాయి అమ్మకాలు చేయడం వల్ల తిరుపతి ప్రతిష్ట కోల్పోవడమే కాకుండా, ప్రజల ఆ పార్టీతో విసిగిపోయారని టీడీపీ అంటోంది. దీనికి తోడు మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరుతో వైసిపి భారీ ఎత్తున అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తున్నారు. తిరుపతి టికెట్టు టీడీపీకి ఇస్తారా? లేదా జనసేనకి ఇస్తారా? అనేది త్వరలో రెండు పార్టీలు కలిసి ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆఖరి వరకు ఎమ్మెల్యే టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే సుగుణమ్మ టికెట్ కోసం తప్పుకోవాల్సి వస్తుంది. టిడిపి నుంచి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు, మాజీ తుడ ఛైర్మన్ నరసింహ యాదవ్ కూడా టీడీపీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. వీరితో పాటు టిడిపి నాయకులు ఊకా విజయ్ కుమార్, జేబీ శ్రీనివాస్, దేవనారాయణరెడ్డి కూడా తన వంతు కృషి చేస్తున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేయకపోతే, జనసేన తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ హరిప్రసాద్ బరిలో ఉంటారని ప్రచారం సాగుతోంది. ఇప్పటికే హరిప్రసాద్ ప్రజా సమస్యలపై విస్తృత పోరాటాలు చేయడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. డాక్టర్ హరి ప్రసాద్ గతంలో టిటిడి బోర్డు సభ్యులుగా పనిచేశారు. వామపక్షాలు కూడా ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది. ఇటీవల కాలంలో వామపక్షాలు ప్రజా సమస్యలపై ఉధృతంగా పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్నాయి. ముఖ్యంగా ఉద్యోగ కార్మిక వర్గాలకు సంబంధించి రాజీలేని పోరాటాలు చేస్తున్న విషయం తెలిసిందే.

ఎన్నికల నిధుల సేకరణలో ఇరు పార్టీల పోటీ

తిరుపతి అసెంబ్లీ సీటు జనసేనకి కేటాయిస్తున్నారని ఆ పార్టీ ఇప్పటికే నిధుల సమీకరణ చేస్తున్నట్లు నగరంలో ప్రచారం సాగుతోంది. ఈసారి తిరుపతి ఎమ్మెల్యే టికెట్ జనసేన పోటీ చేసి గెలిచే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే అధిష్టానం కూడా జనసేన పార్టీ నివేదిక ఇచ్చింది. టీడీపీ, జనసేన కూటమి గెలుపు ఖాయమని జనసేన నేతలు అంటున్నారు. ఇటు టీడీపీ కూడా నిధులు సేకరణ చేస్తున్నట్లు సమాచారం. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేయకపోతే తిరుపతి అసెంబ్లీ టికెట్ టీడీపీకి ఇస్తారని ఆ పార్టీ వర్గీయులు అంటున్నారు. ఎన్నికల నిధుల కోసం ఈ రెండు పార్టీలు పోటీగా నిధులు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

తిరుపతిపై బిఆర్‌ఎస్ ఫోకస్

తిరుపతి అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పోటీ చేయాలని భావిస్తోంది. తిరుపతిలో బలిజ, యాదవ కులస్తుల ఓట్లు అధికంగా ఉండడంతో టిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్‌ను పోటీలో దింపేందుకు అధిష్టానం పరిశీలిస్తోంది. ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో తిరుపతి అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తోంది. ఆర్కాట్ కృష్ణ ప్రసాద్‌కు కాపు సంఘాల నుంచి మద్దతు లభిస్తోంది. లయన్స్ క్లబ్ గవర్నరుగా కూడా నిర్వహించడంతో సేవా కార్యక్రమాలు ఆయన కూడా చేస్తున్నారు. అధిష్టానం ఆదేశిస్తే తిరుపతి అసెంబ్లీకి టిఆర్‌ఎస్ తొలిసారిగా పోటీ చేసి బల ప్రదర్శన నిరూపించుకోనుంది.

కాంగ్రెస్‌కు కొత్త అభ్యర్థి

తిరుపతి అసెంబ్లీ సీటుకు కాంగ్రెస్ కొత్త అభ్యర్థిని నిలబెట్టేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది. తిరుపతి మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్ సూచించిన వ్యక్తికే టికెట్ ఇవ్వనున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా చింతామోహన్ కుటుంబ సభ్యులను దింపాలని ఆలోచన కూడా ఉన్నట్లు సమాచారం. తిరుపతి ఎంపీ సీటుకు చింతా మోహన్ పోటీ చేయనున్నారు. అసెంబ్లీ అభ్యర్థిని కూడా ఆయన చెప్పిన వ్యక్తికే అధిష్టానం టికెట్ కేటాయించనుంది. ఎన్నికలు జరగడానికి ఇంకా మూడు నెలలు ఉండడంతో ఉగాది పండుగ తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది.

కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: అంగన్వాడీలు చేస్తున్న సమ్మె సోమ, మంగళవారాల్లో సంక్రాంతి, కనుమ పండుగ రోజున కూడా సమ్మెను కొనసాగించారు. మంగళవారం నాటికి 36వ రోజుకు చేరుకుంది. సంక్రాంతి సందర్భంగా దీక్షా శిబిరం వద్ద ముగ్గులు వేసి కొత్తకుండ తెచ్చి పొంగలి పెట్టారు. అలాగే కనుమ పండుగ రోజున దీక్ష శిబిరం ముందు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా సంతకాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ నాయకురాలు టి.నాగరాజమ్మ మాట్లాడుతూ 35రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా అక్క, చెల్లెమ్మలు వీధుల్లోకి పోరాడుతున్నా, పండగల సమయంలో కూడా శిబిరాల్లోనే ఉంటున్నా వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. అంగన్వాడీలు కల్పన, గీత, ఎల్లమ్మ, సుజాత, సుజిత, వరలక్ష్మి, గంగాదేవి పాల్గొన్నారు.

తిరుపతిలో..

రేణిగుంట: మంచినీళ్ళ గుంట పాత ఎమ్మార్వో ఆఫీస్ వద్ద జరుగుతున్న అంగన్వాడీ సమ్మె 36వ రోజుకు చేరుకున్న సందర్భంగా కనుమ పండుగ మంగళవారం రోజు శిబిరం వద్ద అంగన్వాడీ అక్క చెల్లెమ్మలు శవాసనం వేసి నిరసన తెలిపారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రేణిగుంట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షకార్యదర్శులు ధనమ్మ, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, పార్వతి, రేవతి, ఐఎఫ్‌టియు నాయకులు రాధమ్మ, విజయలక్ష్మి పాల్గొనగా సిఐటియు నాయకులు వెంకటరమణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి సెల్వరాజ్ సమ్మెకు మద్దతు తెలిపారు.

గూడూరులో..

పిచ్చాటూరు: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని సీపీఎం సత్యవేడు నియోజక వర్గఇన్చార్జ్ దాసరి జనార్దన్ హెచ్చరించారు. 36రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే పట్టించుకోని ప్రభుత్వానికి సంక్రాంతి పండుగ సంబరాలకు కోట్లు రూపాయలను ఖర్చు చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. పండగలు ఇండ్ల వద్ద జరుపుకోవాల్సిన అంగన్వాడీలు ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్న తీరును తూర్పారబడుతూ వారి అనాలోచిత నిర్ణయాలను ఖండిస్తున్నారని తెలిపారు. అనంతరం అంగన్వాడీలకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నాగలాపురం నాగరాజు, రామచంద్రారెడ్డి, మురుగేష్, మురుగన్ అంగన్వాడీలు పాల్గొన్నారు.

వెంకటగిరి: అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 36వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ సభ్యులు వడ్డీపల్లి చెంగయ్య, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అధ్యక్షులు ఏ మంజుల వెంకటగిరి మండల అధ్యక్షులు సుభాషిని మాట్లాడుతూ ఇప్పుడు అంగన్వాడీలను కన్నీరు పెట్టిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా గద్దె దిగిపోవడం ఖాయమని అన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని లేదంటే రోజురోజుకీ సమ్మె ఉధృతం అవుతుందని, జీతాలు పెంచే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

గూడూరు టౌన్: అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కారం కోసం తలపెట్టిన సమ్మె 36వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా

వెంకటగిరిలో..

ఆయన మాట్లడుతూ అంగన్వాడీలు గత 36రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం బాధాకరమన్నారు. యూనియన్ అధ్యక్షురాలు ఇంద్రావతి, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సీఐటియునాయకులు బివి.రమణయ్య, సురేష్ పాల్గొన్నారు.

రేణిగుంటలో..

తిరుమలలో ఘనంగా పార్వేట ఉత్సవం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి పార్వేట ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు శ్రీమలయప్పస్వామివారు తిరుచ్చిలో వేంచేసారు. వారి వెంట మరో తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి వేంచేసారు. అనంతరం పార్వేట మండపంలో పుణ్యాహం, ఆరాధన, నివేదనం జరిగి హారతులు జరిగాయి. అనంతరం ఉభయదార్లకు తాళ్ళపాక వారికి, మఠంవారికి మర్యాదలు జరిగాయి. శ్రీ కృష్ణస్వామి వారిని సన్నిధి యాదవ పూజ చేసిన చోటుకు వేంచేపుచేసి పాలు, వెన్న, హారతులు సమర్పించారు. తరువాత శ్రీమలయప్పస్వామివారు ముందునకు కొంత దూరం పరుగెత్తి వారి తరపున అర్చకులు బాణం వేసి వెనుకకు వచ్చారు. ఇలా మూడుసార్లు జరిగింది. శ్రీమలయప్ప స్వామివారు ఉత్సవం పూర్తయి మహాద్వారంకు వచ్చి హత్తీరాంజీవారి బెత్తంను తీసుకొని సన్నిధిలోనికి వేంచేశారు. ఇంతటితో ఎంతో వేడుకగా జరిగే పార్వేట ఉత్సవం ఘనంగా ముగిసింది. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, ఎస్ఇ -2 జగదీశ్వర్ రెడ్డి, లోకనాథం, ఉన్నతాధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రంగంపేటలో రంకేసిన కోడిగిత్తలు

చెదురు మదుర సంఘటనలతో పలువురికి స్వల్పగాయాలు

ప్రజాశక్తి రామచంద్రపురం (చంద్రగిరి): రంగంపేటలో జల్లికట్టు జోరుగా సాగింది. మంగళవారం ఏ రంగంపేటలో పోలీసు అంక్షలను బేఖాతారు చేస్తూ కోడెగిత్తల పరుష పందాలు అంగరంగ వైభవంగా జరిగాయి. సంక్రాంతి పర్వదినాలలో భాగంగా మూడో రోజు కనుమ పండుగ సందర్భంగా కోడె గిత్తల పరుష పందాలు నిర్వహించటం ఆనవాయితీ. రైతు కుటుంబాలను అన్నివిధాల ఆదుకుంటున్న కోడెగిత్తలు ఆవుల కొమ్ములకు రంగులు వేసి వాటిని శుభ్రంగా కడిగి కనుమ పండుగ రోజున పూజిస్తారు. ఈనేపథ్యంలోనే కోడేగిత్తలకు పలకలు కట్టి బరిలోకి దించుతారు. అప్పటికే మండలం నుండే కాకుండా చుట్టుపక్కల మండలాలు, జిల్లాల నుండి వచ్చిన యువత గుంపులు గుంపులుగా చేరి వాటికి కట్టిన నగదు పలకలను చేజికిచ్చేందుకు పోటీపడ్డారు. పశువుల పాక నుండి బరిలోకి దించి కోడెగిత్తలు వెనక డప్పులు వాయిస్తూ వాటిని బెదరకొట్టగా అవి బెదిరి దూకుడుగా పరిగెత్తుతుండగా యువకులు వాటికి కట్టిన పలకలను చేజిక్కించేదకు పోటీపడ్డారు. ఈ పోటీలో కొంతమంది యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. పరుష పందాలను తిలకించేందుకు విచ్చేసిన జనాలతో ఏ రంగంపేట జనసంద్రమైంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత జట్లుగా ఏర్పడి కోడె గిత్తలకు కట్టిన పలకలను చేజిక్కించుకున్న ఆనందంతో ఎగిరి గంతులు వేయడం జరిగింది. పరుష పందాలకు విచ్చేసిన జనానికి స్థానికులు అన్న పానీయాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓటమి భయంతో వైసీపీ దొంగ ఓట్ల దందా..!

- చంద్రగిరిలో జరిగిన అవకతవకలపై ఎన్నికల కమిషన్‌కు కేస్ స్టడీ
- నానిని పరామర్శించిన చంద్రబాబు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్

ఓటమి భయంతో చరిత్రలో లేనివిధంగా వైసీపీ దొంగఓట్ల దందాకు పాల్పడుతోందని టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రగిరి నియోజకవర్గం ఓటరు జాబితాలో జరిగిన అవకతవకలు ఎన్నికల కమిషన్‌కు కేస్ స్టడీగా తీసుకోవాలని, దొంగఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసనల్లో పులివర్తి నాని పెట్రోల్ పోసుకుని గాయాలపాలవ్వడంతో చంద్రబుబ నాయుడు నానిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎక్కడైనా ఓటరు లిస్టును ఎన్నికల అధికారులు చేస్తారు.. కానీ దుర్మార్గంగా రాష్ట్రంలో వైసీపీ నేతలు దొంగఓట్లు చేర్చుతున్నారని, టీడీపీ సానుభూతిపరులు ఓట్లు తొలగిస్తున్నారని అన్నారు. ఓట్ల అంశంలో రాష్ట్రమంతా ఏం జరుగుతోందో చూస్తే... ఎన్నికల కమిషన్‌కు చంద్రగిరి నియోజకర్గం కేస్ స్టడీగా ఉంటుందన్నారు. ఇటీవల ఎన్నికల కమిషన్ తిరుపతి కలెక్టర్, ఎస్పీఎలపై ఆగ్రహం వ్యక్తం చేసిందని, లోక్‌సభ ఉపఎన్నికల్లో జరిగిన అక్రమాలపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. విచ్చలవిడిగా ఫామ్-6, ఫామ్-7 దొంగఓట్ల చేర్పులు, టీడీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపుపై పులివర్తి నాని ఆరు నెలలుగా పోరాడుతున్నారని, ఈ అవకతవకలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో ఆత్మహత్యాయత్నం చేశారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 11 నియోజకవర్గాల్లో ఫామ్-6, ఫామ్-7, ఫామ్ -8ను విచ్చలవిడిగా ఉపయోగించారని అన్నారు. ఇవన్నీ చూస్తే ఎన్నికల అధికారులు ఎంతగా అధికారపార్టీ నేతలతో కుమ్మక్కయ్యారో తెలుస్తోందన్నారు. ఓట్ల అవకతవకలు చూడాల్సిన బాధ్యత ఉద్యోగులదని తప్పులు జరిగితే జైలుకు పంపించే అవకాశం ఉన్నా అధికారులు తేలిగ్గా తీసుకున్నారని అన్నారు. సచివాలయ సిబ్బందిని నియమించి అవకతవకలకు పాల్పడుతున్నారు. 10 ఎన్నికలు చూశాను..ఎప్పుడూ ఇలాంటి అవకతవకలు చూడలేదని, వైసీపీ నేతలకు పాస్‌వార్డు ఇవ్వడంతో ఎమ్మార్వో కార్యాలయంలో కూర్చుని నమోదు చేస్తున్నారని ఆరోపించారు. వాలంటీర్ వ్యవస్థ ఎన్నికల విధుల్లో ఉండదని ఎన్నికల కమిషన్ చెప్పిందన్నారు. వాలంటీర్లు కూడా ప్రజలకు మేలు చేయడం వరకే ఉంటే గౌరవిస్తామని, ఒక పార్టీకే పనిచేస్తే శిక్ష పడేలా చేస్తామని హెచ్చరించారు. అధికార యంత్రాగాన్ని నేరస్తులుగా తయారు చేస్తున్నారని, కుప్పంలో దొంగ ఓట్లు ఉంటాయని అన్నారు. తప్పించుకోవడానికి దొంగే దొంగ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

పండుగ వేళ సరుకుల గోల

సర్కారు తీరుతో సంసారాల్లో లొల్లి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సంక్రాంతి పండగ సందర్భంగా సరుకులు కొనాలి అంటే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు పెరిగిన ధరలు ఇబ్బందికరంగా మారింది. గత నెల రోజులుగా కార్మికుల సమ్మె బాట పట్టడంతో, వేతనాలు లేక, భార్య పిల్లలకి కనీసం కడుపునిండా తిండి పెట్టలేక కాపురాల్లో గొడవలు ఏర్పడ్డాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ తీరే కారణం కావడం గమనార్హం.

సంక్రాంతి, కనుమ తెలుగు వారి ముఖ్య పండగలు.. పేదవారు సైతం, అల్లుళ్ళు, కోడలు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని భావిస్తారు. కానీ మధ్యతరగతి ప్రజలు సైతం ఈ పండలను జరుపుకోవాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి. మాంసాహారం మాట దేవుడెరుగు.. కనీసం కూరగాయలు, ఆకుకూరలతో వచ్చిన బంధువులకి సంతృప్తిగా భోజనం పెట్టాలన్నా ఇబ్బందిగా మారింది. మార్కెట్లో కిలో వంకాయలు రూ.60లు, కిలో బెండకాయ రూ.120లు, బీన్స్ కిలో 80, క్యారెట్ కిలో 50, ఉల్లిగడ్డ కిలో 40, పచ్చిమిర్చి కిలో 60, టమోటా కిలో 30, గోంగూర కట్ట పది రూపాయలు, ఆకుకూర కట్ట 20, పుదీన కట్ట 10, తెల్ల గడ్డలు కిలో రూ.400లు, ఎండి మిరపకాయలు కిలో రూ.400, బెల్లం కిలో రూ.60, చక్కెర కిలో రూ.48, బియ్యం కిలో రూ.66లు, సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో రూ.160లు ఇలా నిత్యావసర సరుకులు ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా ఆకాశాన్ని అంటుతున్నాయి. తెలుగువారికి అతి ప్రాముఖ్యమైన సంక్రాంతి పండుగను సైతం, పేదవారు సామాన్యులు జరుపుకునేని పరిస్థితి ఏర్పడింది. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు, ఆశ వర్కర్లు, సర్వ శిక్షణ కేంద్రం సిబ్బంది, మున్సిపల్ కార్మికులు, 104, 108, 102 సిబ్బంది ఇలా రకరకాల విభాగాలు చెందిన కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. వీరి సమస్యలపై స్పందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడంతో పాటు, రెచ్చగొట్టే ధోరణి ప్రవర్తించడంతో కనీసం వారికి వేతనాలు కూడా అందుబాటులోకి రావడం లేదు. పరిస్థితి ఇలా ఉంటే పండుగలు ఎలా జరుపుకోవాలని పాలకుల తీరు వల్ల, అహర్నిశలు కష్టపడే కార్మికుల బతుకులు, సంక్రాంతి పండుగ సందర్భంగా చీకటి అలుముకుంది. పండగలు సైతం పట్టించుకోకుండా కార్మికులు తమ జీవితాలు బాగుపడితే చాలునని ఆందోళన పట్టడానికి ప్రభుత్వ తీరే కారణం. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పాలకులు ఓట్ల రాజకీయాలకు పాల్పడడమే నిదర్శనం. ఇప్పటికైనా పాలకులు స్పందించి, కార్మికులు చేపట్టిన న్యాయమైన ఉద్యమ పరిస్థితులను గుర్తించి, వారికి న్యాయం చేసేందుకు కృషి చేయాలని, వారి కుటుంబాలు సైతం బాగుపడేందుకు సహకరించాలని పలువురు మేధావులు కోరుతున్నారు.

గోవులను రక్షించుకుందాం..

సంస్కృతిని కాపాడుకుందాం

టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: వేదాలు, పురాణాల్లో పేర్కొన్న విధంగా సకల దేవతాస్వరూపాలైన గోవులను పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు ప్రతిన బూనాలని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి పిలుపు నిచ్చారు. తద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర గోసంరక్షణశాలలో మంగళవారం కనుమ పండుగ సందర్భంగా గో మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన టీటీడీ ఛైర్మన్ మాట్లాడుతూ, గోవు గొప్పతనాన్ని భావితరాలకు అందించేందుకు గోపూజ కార్యక్రమాన్ని టీటీడీ చేపట్టినట్టు తెలిపారు. తిరుపతి, పలమనేరులోని గోశాలల్లో 2,500కు పైగా గోవులు ఉన్నట్లు చెప్పారు. తిరుమల శ్రీవారి ఉత్సవాలలో, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఉత్సవాల్లో, స్థానిక ఆలయాలలో జరిగే ఉత్సవాలలో గో శాలలోని ఏనుగులు, అశ్వాలు, వషబాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. తిరుమల శ్రీవారికి దేశీయ గోజాతుల పాల నుండి తీసిన వెన్నను సమర్పిస్తున్నట్లు తెలియజేశారు. పూర్వకాలం నుండి కనుమ పండుగ రోజున గోపూజకు చాల ప్రాదాన్యత ఉందన్నారు. గోవును పూజించడం వలన పాడిపంటలు పుష్కలంగా పండి లోకం సుభిక్షంగా వుంటుందని తెలిపారు. ఇప్పటి వరకు దాతలు రూ.250 కోట్లకు పైగా "ఎస్వీ గో సంరక్షణట్రస్టు" కు విరాళాలు అందించినట్లు వివరించారు. అంతకుముందు ఛైర్మన్ గోశాలలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గౌరిపూజ, తులసిపూజలో పాల్గొన్నారు. తర్వాత గజరాజులు, అశ్వాలు, వషభాలు, గోవులకు పూజలు చేసి కర్పూర హారతులు సమర్పించి, వాటికి దాణా అందించారు. ఎస్వీ గోశాల సంచాలకులు డాక్టర్ హరనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీటీడీ గోసంరక్షణ ట్రస్టు సభ్యులు రాం సునీల్ రెడ్డి , శ్రీధర్, ఎవీ బీసీ సిఈవో షణ్ముఖ కుమార్, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి సోమయాజులు పాల్గొన్నారు.

ఘనంగా వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఎస్‌జె హీరోస్ మెమోరియల్ టోర్నమెంట్, వాయుపుత్ర ఆర్ట్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఓటేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన టోర్నమెంట్‌కు అనేక మంది బాలురు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈకార్యక్రమానికి తిరుపతి ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణ్, బీమాస్ హోటల్ అధినేత అశోక్, కాసారం హరీష్ విచ్చేశారు. ఇందులో ఎస్జె హీరో టీం విన్నర్స్ గాను, కిషోర్ టీం రన్నర్స్ గాను నిలిచారు. గెలుపొందిన టీంలకు ట్రోఫీల్ని అందజేశారు. వాయుపుత్ర ఆర్ట్స్ అధినేత బి.సోమ, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక జీవోల కీడు తొలగిపోవాలి: టీడీపీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రాష్ట్రంలో వైయస్ జగన్‌మోహన్ రెడ్డి 57 నెలలుగా భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రజా వ్యతిరేక విధానాలతో వారి స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డగోలుగా జీవోలు, అమలు కాని పథకాలతో ప్రజలను మోసం చేయడం తొలగిపోయి మంచి రోజులు రావాలని టిడిపి నాయకులు జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు షణ్ముగ రెడ్డి, వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి అర్జున్ రెడ్డి, మాజీ వార్డు అధ్యక్షులు అర్పుగ రెడ్డి, పుత్తూరు పట్టణ టీడీపీ ఉపాధ్యక్షులు ఏలుమలైరెడ్డి, పట్టణ కార్యదర్శి నాగరాజు, చిదంబరం, జిల్లా టీఎన్‌టీయూసీ కార్యదర్శి మణి రెడ్డి, వార్డు కార్యకర్తలు చిరంజీవి పాల్గొన్నారు.

వృద్ధులకు సరుకులు పంపిణీ చేస్తున్న దాతలు

వృద్ధులకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: వైజెపి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఫల సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఎల్ఎస్ స్వామి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా క్లబ్ పర్మినెంట్ ప్రాజెక్ట్ అయిన డాక్టర్ శివార్ రెడ్డి ఫలసరుకుల పంపిణీ ప్రతి నెల క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జోన్ ఛైర్మన్ మురళి, సీనియర్ సభ్యుడు ఆదివిరావు, మాజీ అధ్యక్షుడు వేణు రెడ్డి, క్లబ్ సభ్యులు వెంకట రామి రెడ్డి, బండ్ల సుధాకర్, శివారం, రాజేంద్ర ప్రసాద్, కార్యదర్శి గోపీ నాథ్ రెడ్డి, ఎస్‌కెబషీర్, శీనయ్య, గురునాధం పాల్గొన్నారు.

18న 'విశ్వం'లో

ఉచిత నవోదయ మోడల్ ఎంట్రన్స్ టెస్ట్

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి స్థానిక వరదరాజ నగర్ లోని విశ్వం విద్యా సంస్థలలో ఈ నెల 18వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు ఉచిత జవహర్ నవోదయ విద్యాలయ మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు విశ్వం విద్యాసంస్థల అధినేత, కౌన్సిల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్ విశ్వనాథ రెడ్డి తెలిపారు. 6వ తరగతి ప్రవేశానికి జాతీయ స్థాయిలో జనవరి 20వ తేదీన నిర్వహించే ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ నమూనా పరీక్ష ద్వారా విద్యార్థులు ప్రధాన పరీక్షకు సంసిద్ధం కావడంతో పాటు సబ్జెక్ట్ పరంగా లోపాలను సరిదిద్దుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ నమూనా పరీక్షకు ఎలాంటి ప్రవేశ రుసుము చెల్లించన అవసరం లేదన్నారు. నమూనా పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ (అడ్మిట్ కార్డు) జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 8688888802, 9399976999 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

వైసిపి నాయకుని అంత్యక్రియల్లో పాల్గొన్న నేదురుమల్లి రామ్‌కుమార్

వైసిపి నాయకుని అంత్యక్రియల్లో నేదురుమల్లి

ప్రజాశక్తి - బాలాయపల్లి : మండలంలోని పీగిలాం గ్రామ వైసిపి నాయకుడు మావిళ్లపల్లి రమణయ్య నాయుడు మంగళవారం మృతి చెందడంతో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఛైర్మన్, తిరుపతి వైసిపి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన తమ కుటుంబంతో ఎంతో సన్నిహితంగా ఉండేవారు తెలిపారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియలలో పాల్గొన్నారు.

మామిడిలో పూత సస్యరక్షణ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : జిల్లాలో మామిడి పూత ప్రారంభమైంది. చెట్లలో మొగ్గలు వచ్చే దశలో తేనె మంచు పురుగు, బూడిద తెగులు ఆశించి పూతను నష్టపరుస్తాయని తిరుపతి వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ మెరుగు భాస్కరయ్య ప్రకటనలో పేర్కొన్నారు. రెమ్మలను కదిలించినప్పుడు చిటపటమని దోమలు బయటకు వస్తే తేనెమంచు పురుగులు ఉన్నట్లు గుర్తించాలన్నారు. ఈ పురుగులు పూమొగ్గల నుంచి రసాన్ని పీల్చేసి తేనెలాంటి పదార్థాన్ని విసర్జిస్తాయని, ఆకులపైన పడిన ఈ తియ్యటి పదార్థంపైన నల్లబూజు పెరిగి మసితెగులు వ్యాపిస్తుందన్నారు. ఈ పురుగు వలన పూత వడలి రాలిపోతుందని, బూడిద తెగులు పూత రెమ్మలపైన బూడిద రంగులో బూజును వ్యాపింపచేసి పూత మగ్గిపోయేట్లు చేస్తుందని, ఈ తెగులు ఆశించిన పూత గుత్తులన్నీ మగ్గిపోయి రాలిపోతాయని తెలిపారు. మామిడి చెట్లలో పూత మొగ్గదశలో ఉన్నప్పుడే రైతులు నివారణా చర్యలు చేపట్టాలన్నారు.

నేడు మానవహారం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సామాజిక సమత సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఈనెల 17న బుధవారం ఉదయం 10 గంటలకు ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో గల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, మానవహారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గోవిందరాజస్వామి ఆలయంలో గోదా పరిణయోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: గోవిందరాజస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం గోదా పరిణయోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 4 నుండి 6.30 గంటల వరకు ఆలయంలోని పుండరీకవల్లి అమ్మవారి ఆలయంవద్ద శ్రీకృష్ణ స్వామికి, గోదాదేవి అమ్మవారికి పరిణయోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్ రావు, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనంజయ ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారికి మోక్షం ఏదీ?

- ప్రమాదకరంగా గుంతలు - ఆందోళనలో వాహన చోదకులు

ప్రజాశక్తి- నారాయణవనం: మూడేళ్లకు పైగా రోడ్ల మరమ్మతుల విషయం పట్టించుకునే దిక్కు లేకపోవడంతో నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం , వరదయ్యపాలెం మీదగా వెళ్లే పుత్తూరు –చెన్నై జాతీయ రహదారిలో వాహనదారులు పడుతున్న అవస్థలు వర్ణనాతీరం.. ప్రధానంగా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్య ను పలుమార్లు తీసుకువెళ్లినా ఫలితం శూన్యమని వాహనదారులు వాపోతున్నారు. ప్రధానంగా సత్యవేడు నియోజకవర్గం పరిధిలోని నారాయణవనం, పుత్తూరులోని చెన్నై జాతీయ రహదారి రోడ్డు దుస్థితికి చేరింది. ఈ కారణంగా ఆంధ్ర – తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు రోడ్డులో వెళ్లే వాహనదారులు పలు ఇబ్బందులు పడు తున్నారు. దీనికి తోడు శ్రీ సిటీలోనే వివిధ పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికులు సైతం ఈ రోడ్డు మార్గం లోనే ఎక్కువగా రాక పోకలు సాగిస్తున్నారు. మరమ్మతులు లేకపోవడంతో మోకాలు లోతులో గుంతలు పడిపోవడం, కొన్ని కీలక మలుపులు వద్ద రోడ్డు అధ్వాన స్థితికి చేరుకుంది.

పడితే పుత్తూరు కట్టే..!

వర్షాకాలంలో ఈ రోడ్డు మీద ఉన్న గుంతలు తెలియక అనేక మంది ప్రమాదాలకు గురి అవుతున్నారు. నారాయణవనం, పాలమంగళం, పిచ్చాటూరు, నాగలాపురం, వరదయ్యపాలెం, సత్యవేడు ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ఈ రోడ్డు మీదే రాకపోకలు సాగిస్తున్నారు. గుంతల్లో పడితే కాలు, చేయి విరిగి పుత్తూరు కట్టు కట్టుకొని సుమారు నెలరోజులు పాటు ఇంటి వద్ద ఇబ్బందులు పట్టేవారు అనేక మంది ఉన్నారు. అంతే కాక ప్రాణాలు కోల్పోయి ఇంటికి దిక్కు లేక ఉన్నవారూ ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి యుద్ధ ప్రతిపదికన ఈ రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు గ్రామస్తులు, వాహన చోదకులు కోరుతున్నారు. అధికారులు స్పందించాల్సిన అవసరం వుంది.

గుంతలమయమైన పుత్తూరు- చెన్నయ్ జాతీయ రహదారి

ఘనంగా 'నురువి'లో పొంగల్ వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వేలూరులోని నురువి ఆసుపత్రిలో పొంగల్(సంక్రాంతి) ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐక్యతా పొంగల్ పేరుతో వైవిధ్యంగా, వ్యవసాయాన్ని ప్రతిబింబించే విధంగా ఈ పండుగను నురువి ఆసుపత్రి వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జీవి సంపత్ అధ్వర్యంలో నిర్వహించారు. తమిళుల సంస్కృతి సంప్రదాయాల ప్రాముఖ్యతను, తమిళ సంప్రదాయ వస్త్రధారణ, ఘనకీర్తిని తెలిపేలా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. డాక్టర్ సంపత్ మాట్లాడుతూ ఈ పండుగ రైతులకు అంకితమని, తమిళనాడుతో పాటు పొరుగు రాష్ట్రాల్లోని తమిళ ప్రజల కుల మతాలకు అతీతంగా సామరస్యం, సమానత్వానికి ప్రతీకగా పొంగల్ పండుగను అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, యాజమాన్యం సిబ్బంది, పారా మెడికల్ ఉద్యోగులు పాల్గొని వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. డాక్టర్ సంపత్ తో పాటు, వైస్ ఛైర్ పర్సన్, అనితా సంపత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పాల్ హెన్రీ, మెడికల్ సర్వీసెస్ చీఫ్ డాక్టర్ అరవిందన్ నాయర్, మెడికల్ సూపరింటెండెంట్ జాకబ్ జోస్, జనరల్ మేనేజర్ నితిన్ సంపత్, దిలీప్ మాథ్యూ, వెంకటరంగం, నందకుమార్ పాల్గొన్నారు.

కుండలో పొంగలి వండుతున్న డాక్టర్ సంపత్

ఐక్యత చాటడమే సంక్రాంతి ప్రత్యేకత: టిఎస్ఆర్

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఐక్యతతో అందరిని కలుపుకొని అన్ని మతాలతో తేడా లేకుండా ఐక్యత సంప్రదాయ పూర్వీకుల పద్ధతుల గొప్పతనాన్ని సాటి చెప్పేది సంక్రాంతి పండుగ ప్రత్యేకత అని మాజీ టూరిజం డైరెక్టర్ తిరుమర్ల సురేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సొంత నివాసమైన వెస్ట్ వరత్తూరులో పలు గ్రామాల గొబ్బెమ్మ బృందాలతో కలిసి కనుమ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి, సంక్రాంతి, సంప్రదాయ పండుగలు ఐక్యతకు పట్టుకొమ్మలుగా నిలుస్తాయని అందుకే భారతదేశం ఇప్పటి వరకు ప్రపంచ దేశాలలో ఒక మంచి ప్రజాస్వామ్య గుర్తింపు కలిగిన దేశంగా వెలుగుతోందని మాజీ టూరిజం డైరెక్టర్, వినాయక ట్రస్ట్ అధినేత సురేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. పండుగలు ఏ ఒక్క వర్గానికి సొంతం కాదని సాటి చెప్పేది సంక్రాంతి పండుగను ఆయన తెలిపారు. తన వంతు సాయంగా గొబ్బెమ్మల బృందానికి, ఇతరులకు సురేందర్ కుమార్ రెడ్డి చేయూతను అందిస్తున్నారు.

19న సభను విజయవంతం చేయండి: టిడిపి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 19వ తేదీ వెంకటగిరిలో నిర్వహించనున్న 'రా కదలిరా బహిరంగ సభకు' మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్నారని, ప్రజలు , టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని టిడిపి గూడూరు నియోజకవర్గ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. 'రా కదలిరా బహిరంగ సభ'కు జన సమీకరణ పై గూడూరు టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు వెంకటగిరిలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'రా కదలిరా బహిరంగ సభ ' నిర్వహిస్తారని గూడూరు నియోజకవర్గం నుంచి 15 వేల మంది జనాన్ని సమీకరిస్తున్నామన్నారు. ప్రజలు, టిడిపి నాయకులు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు భాస్కర్ రెడ్డి, పులిమీ శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు, వెంకటేశ్వర రెడ్డి, మట్టం శ్రావణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

ఘనంగా జాతీయ సైనిక దినోత్సవం

ప్రజాశక్తి-పాకాల: జాతీయ సైనిక దినోత్సవం సందర్భంగా దామల చెరువు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ సైనిక దినోత్సవం ఘనంగా నిర్వహిం చినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నాగూర్ బాష తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ 317 మాజీ ఈ డిస్టిక్ గవర్నర్, గ్లోబల్ సేవ, ప్రజా సంబంధాల సలహాదారు లయన్ సివి భాను మూర్తి రెడ్డి హాజరై సైనికుల సేవలను, త్యాగాలను కొనియాడారు. జోన్ ఛైర్‌పర్సన్, లయన్ కే యసానుల్లా, సెక్రెటరీ ఆనంద్, ట్రెజరర్ రెడ్డిబాష డిసికెఎస్ మస్తాన్, మాజీ సైనికులకు జాతీయ సైనిక దినోత్సవం శభాకాంక్షలు తెలిపారు. డిస్ట్రిక్ట్ ఛైర్ పర్సన్ జి రామయ్య మాట్లాడుతూ సైనికుల ప్రత్యేక విలువలను, క్రమ శిక్షణను, త్యాగాలను, అనుక్షణం దేశ రక్షణలో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ప్రతికూల పరిస్థితుల్లో రక్షణ కల్పిస్తున్న సైనికులకు పాదాభివందనం తెలిపి శేష జీవితంలోనూ పర్యావరణాన్ని సమాజానికి , అవసరమైన సేవలను, లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి చేయాలన్నారు. మాజీ సైనికులు నరేంద్ర మాట్లాడుతూ నేర రహిత సమాజాన్ని భారత్‌లో నిర్మించాలని, రక్షణ, పోలీస్, న్యాయ వ్యవస్థలో వ్యయం తగ్గించాలని అప్పుడే భారతదేశం తక్కువ కాలంలో సర్వతో ముఖాభివృద్ధి చెందు తుందన్నారు. అనంతరం 29 మంది సైనికులకు శాలువాలు, పుష్పగుచ్చాలు, మెమొంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ గులాబ్జాన్, నాగూర్ బాష, సైదుల్లా, మహమ్మద్, సతీష్, పరిసర గ్రామాలలోని మాజీ సైనికులు జీకే మస్తాన్, బాబు సాహెబ్ , ఆంజనేయులు, ఆర్పీ ఖాదర్‌బాషా, నరేంద్ర పాల్గొన్నారు.

పాల్గొన్న మాజీ సైనికులు, లయన్స్ క్లబ్ సభ్యులు

మాజీ జవాన్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

ప్రభుత్వ లాంఛనాలతో వీడ్కోలు

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని అశోక్ నగర్‌లో మాజీ సిఐఎస్ఎఫ్ జవాన్ గాలి గురవయ్య (74) అనారోగ్యం పాలు కావడంతో ఆదివారం ఆస్పత్రికి తీసుకు వెళుతుండగా మృతి చెందాడు. గాలి గురవయ్య మృతి గురించి బిఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ జనార్ధన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ లాంఛ నాలతో దహనక్రియలు చేసేందుకు కృషి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం తరపున పారా మిలిటరీ సిబ్బంది ఏఎస్ఐ వెంకటేష్ యాదవ్, హెడ్ కానిస్టేబుల్ రెడ్డి శ్రీనివాసులు, బి సూర్యరావు, మాజీ బిఎస్ఎఫ్ సైనికులు, చందు కుమారులు, స్థానిక అంబేద్కర్ వారసుడు గాలి రవి, పిల్ల పాలెం వాసుదేవులు, కలపా టి గురవమ్మ, ఇతర సోదరీ సోదరులు పాల్గొన్నారు.

వైసిపి నేత మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో వైసిపి యువనేత కొంగర మునీంద్ర బాబు తండ్రి కొంగర మునిరెడ్డి అకాల మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి, గున్నేరి కిషోర్ రెడ్డి, మునిరెడ్డి ఆయన కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాతవీరాపురం సర్పంచ్ పాతగుంట మంజుల, ఏర్పేడు మండలం మాజీ అధ్యక్షుడు పాతగుంట గురవారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు రెడ్డిగారి మోహన్ రెడ్డి, కాళహస్తి సుబ్రమణ్యం రెడ్డి, పాతగుంట రవిచంద్ర రెడ్డి, కొదండ రామిరెడ్డి, కొంగర దాము, కొంగర మునిరత్నం రెడ్డి , ముసలిపేడు గ్రామ సర్పంచ్ శేఖర్ రెడ్డి , సీ హరిదాసు రెడ్డి ,నాయకులు , కార్యకర్తలు దహన సంస్కారాల్లో పాల్గొన్నారు.

భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

భానుప్రకాష్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పురపాలక సంఘం పరిధిలోని 7వ వార్డు ఇన్‌ఛార్జి ఎన్ ఎన్ ధనపాల్, 10వ వార్డు ఇన్‌ఛార్జి డిజి ధనపాల్ యువకులతో కలిసి నగరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గాలి భానుప్రకాష్ ను సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నగరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గాలి భాను ప్రకాష్ , నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోవు 2024 జనరల్ ఎలక్షన్స్‌లో టిడిపి జెండా నగరి లో, రాష్ట్రంలో ఎగరవేయడం ఖాయం అని ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు తమవంతు కృషి చేయాలని కోరారు. అనంతరం గాలి భాను ప్రకాష్‌ను ఘనంగా పూల మాలవేసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ యాదవ్, యువకులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పోలీసుల అదుపులో కోడిపందెం రాయుళ్లు

కోడి పందెం స్థావరంపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కంచన పుత్తూరు సమీపంలో కోడి పందేలు ఆడుతున్నారని సమాచారం అందుకున్న ఎస్ఐ నరసింహం తమ సిబ్బందితో దాడులు నిర్వహించి నలుగురిని అదుపులో తీసుకొని వారి వద్ద నుండి రెండు కోళ్లు, 3,500 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇకపై మండలంలో ఎక్కడైనా కోడి పందేలు ఆడినట్లు తెలిసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకట నరసింహం హెచ్చరించారు. అంతే కాకుండా సంక్రాంతి పండుగలు ఎక్కడైనా మద్యం సేవించి ఒకరిపై ఒకరు దాడిలు చేసుకుంటే వారిపై కూడా చర్యలు తీసుకొని జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఏఎస్ఐ రమేష్ శరత్, రంగా, అరుణ్ పాల్గొన్నారు.

టీటీడీ ఛైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే

టిటిడి ఛైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి- నారాయణవనం: టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డిని సోమవారం సాయంత్రం పద్మావతి పురంలోని భూమన నివాసం వద్ద ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మర్యాద పూర్వ కంగా కలిసి ఆయనకు శాలువా కప్పి పుష్ప గుచ్చం అందించారు. అనంతరం ఆయనతో తనకు తిరుపతి పార్లమెంట్ ఎంపీగా పోటీ చేసేందుకు అధిష్టానం ప్రకటించిన విషయంపై ఆయనతో చర్చించారు. అనంతరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తుమ్మలగుంట లోని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వక కలిసి ఆయనకు శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించారు.

క్రికెట్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ముగిసిన మాస్టర్ లీగ్ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - గూడూర్ టౌన్ : గూడూరులో క్రీడలను ప్రోత్సహిస్తూ ప్రతి సంవత్సరం హరి చంద్రా రెడ్డి క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని వైసిపి నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో కనుమూరు హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్టర్స్ క్రికెట్ లీగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. విజేతలైన వారికి వైసీపీ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి నిర్వాహకులు కనుమూరు హరిచంద్ర రెడ్డి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎల్లసిరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్టేడియంలో నిరంతరం ఏదో ఒక క్రీడలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నేటితరం పిల్లలు ఎక్కువగా సెల్‌ఫోన్లతో కాలం గడుపుతున్నారని వారికి క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా కనుమూరు హరిచంద్రా రెడ్డి మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఇతర ప్రాంతాల్లో ఉండి వచ్చిన మిత్రులు కలిసేందుకు గత 15 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని రాబోయే రోజుల్లో దీన్ని కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో మన పాటీ రవి, మీరా రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నాగేశ్వరరావు, లవ కుమార్, సుబ్రహ్మణ్యం, రాజేంద్ర పాల్గొన్నారు.

చిల్లీస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

వైభవంగా 'చిల్లీస్' లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ నగర అధ్యక్షులు చిల్లీస్ రెస్టారెంట్స్ అండ్ హోటల్స్ అధినేత చిల్లీస్ అంజి ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దాదాపు 200 మందికి పైగా మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొ న్నారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతిగా పదివేలు, రెండవ బహుమతిగా 8వేలు, మూడవ బహుమతిగా 7వేలు విలువ చేసే ట్రావెల్ బ్యాగ్, బ్లెండర్, ఫ్లాస్క్, హాట్ బాక్స్, కత్రి, బ్రాండెడ్ హ్యాండ్ బ్యాగ్ లు, 4 నుంచి 10వ స్థానంలో బహుమతుల పొందిన మహిళలకు 1500 విలువ చేసే డిజిటల్ అలారం, బ్లూటూత్ స్పీకర్స్ ను చిల్లీస్ అంజి చేతుల మీదుగా మహిళలకు అందించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు వారితో పాటు వచ్చిన పిల్లలకు కుటుంబ సభ్యులకు దాదాపు 200 మందికి పైగా వారందరికీ చికెన్ బిర్యానీలు అందించారు. ఈ సందర్భంగా చిల్లీస్ అంజి మాట్లాడుతూ ప్రతి ఏడాది సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి, వారికీ తన వంతు ఆర్థికంగా ఆదుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. ముగ్గుల పోటీ విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో చిల్లీస్ అంజి తో పాటు స్నేహితులు, కుటుంబ సభ్యులు చిల్లీస్ రెస్టారెంట్స్ అండ్ హోటల్స్ సిబ్బంది, మహిళలు, చిన్నారులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా కనుమ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకొని కనుమ పండుగను మండల రైతులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రైతులు ఉదయం లేవగానే ఆవులను, ఎద్దులను చెరువుల్లో బావుల వద్దకు తీసుకెళ్లి శుభ్రంగా స్నానం చేయించారు. వాటి కొమ్ములకు రంగులు దిద్ది అందంగా అలంకరించి ఊరేగించారు. ప్రసాదాలు తయారుచేసి అందరికీ పంచిపెట్టారు.

పుత్తూరు రూరల్ మండలంలోని తడుకు పంచాయతీ వేణుగోపాల పురం గ్రామంలో జరిగిన. యువకులు క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగింది. ఇందులో గెలుపొందిన వారికి ముఖ్య అతిథిగా హాజరైన తడుకు సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్ యాదవ్ బహుమతులు అందించారు. విన్నర్ టీమ్ శీనుకు మూడువేలు నగదు, రన్నర్ హరి టీమ్ కి రెండువేల రూపాయలు నగదు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేష్ బొబ్బిలి యాదవ్ మాట్లాడుతూ యువకులు ఆటల పోటీల్లో కూడా ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ఇలాంటి పోటీలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. క్రీడా స్ఫూర్తిని ఇలాగే కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక

సభ్యులను సన్మానించిన మంత్రి రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలంలో యాదవ సంఘం అధ్యక్షులు, కార్యదర్శులను మంగళవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా మంత్రి కార్యాలయంలో వడమాల పేట మండలం యాదవ సంఘం అధ్యక్షుడు వి.రమేష్ , ప్రధాన కార్యదర్శి పరుశురాం, ఉపాధ్యక్షుడు వై సుధా యాదవ్ , గౌరవ అధ్యక్షుడు కే సదాశివయ్య, ట్రెజరర్ చిన్నప్పలను మంత్రి సన్మానించారు. నూతనంగా ఎన్ను కున్న యాదవ సంఘం సభ్యులతో కలిసి యాదవ సంఘానికి సంబం ధించిన సమస్యలు, అభివృద్ధి సంక్షేమంపై సమీక్షిం చారు. మంత్రి దృష్టికి తీసు కెళ్లిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వడమాల పేట మండలం యాదవ సంఘం నాయకులు నందయ్య, వెంకట సుబ్బయ్య, ధర్మయ్య, రాజేంద్ర, పాపయ్య, జయరాం, యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు ఆనందయ్య, మాజీ కార్యదర్శి రవి, వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి రోజా